తెల్లాపూర్‌లో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం, జూన్ 24 : తెల్లాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గ్రామస్తులు పట్టుకొని అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. తెల్లాపూర్ గ్రామంలోని జీబ్లాక్‌లో ఉన్న ఓషెడ్‌లో రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి సేకరించి అక్రమంగా డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన బియ్యాన్ని తెల్లాపూర్ నుంచి వేరే ప్రాంతానికి లారీలో తరలిస్తున్నారు. ఇది గమనించిన గ్రామస్తులు లారీని పట్టుకొని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కి సమాచారం అందించారు. ఆయన సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ తేజశ్వినితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఆమె కొల్లూర్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఎస్సై సురేశ్ నేతృత్వంలో లారీలో లోడ్ చేసిన బియ్యం, షెడ్‌లో ఉన్న

తెల్లాపూర్‌లో గ్రామస్తులు పట్టుకున్న అక్రమ రేషన్ బియ్యం లారీ

బియ్యం బస్తాలను సీజ్ చేశారు. పట్టుబడిన బియ్యం సుమారుగా 20 టన్నుల వరకు ఉంటుందని అధికారులు అంచన వేశారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

హోమియో వైద్య శిబిరం సక్సెస్

సంగారెడ్డి, జూన్ 24 : సమాజంలో ఇంగ్లిష్ మందులతో పాటు హోమియోపతికి ఉన్న విలువలను ప్రజలకు తెలియజేస్తూ ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎంపీటీసీ లాడే మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని 9వ వార్డు ఆర్టీసీ కాలనీలో ఎంఎన్ఆర్ కళాశాల యాజమాన్యం హోమియో పతి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి కాలనీవాసులకు వైద్యబృందం వైద్యులు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో శ్రీరామ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌స్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సురేశ్ గౌడ్, యాదయ్యలతో

ఆర్టీసీ కాలనీలో రోగులను పరీక్షిస్తున్న వైద్య కళాశాల వైద్య బృందం

పాటు సభ్యులు రాములు, అనిల్, సంగమేశ్వర్, ప్రభు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

జిన్నారం, జూన్ 24 : 'రోడ్డు ఇలా ప్రయాణం ఎలా' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈనెల 17న ప్రచురితమైన కథనానికి గ్రామ యువకులు స్పందించారు. మాదారం నుంచి వడిగేపల్లి రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాక్ స్టాండ్ క్రషర్ యజమాన్యం సహకారంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను జేసీబీ సహాయంతో డస్ట్‌తో పూడ్చివేసి బాగు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతులు నిర్వహించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని

జేసీబీతో గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

గ్రామ యువకులు విజ్ఞప్తి చేశారు. గ్రామ యువకులు విజయ్ కుమార్ గౌడ్, సుదర్శన్, కుమార్, భాస్కర్, మల్లేశ్, గణేశ్, శేఖర్, అజయ్‌సింగ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతల నిరసన

జిన్నారం, జూన్ 24 : ఏమాత్రం అర్హత లేని మండలాన్ని సైతం మున్సిపాలిటీగా మార్చడం దారుణమని జిన్నారం మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ఆది రామకృష్ణ అన్నారు. మంగళవారం యువజన నాయకులతో కలిసి రాళ్లకత్వ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ఖండించారు. వ్యవసాయ గ్రామీణ నేపథ్యం కలిగిన జిన్నారం మండలాన్ని మున్సిపాలిటీగా ఎలా ఏర్పాటు చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యువజన నాయకులు దేవేందర్, కృష్ణ, అంజి గౌడ్, సాయి గౌడ్, గణేష్, శ్రీనివాస్, బాలేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న జీఆర్ఎస్ నాయకులు

చేవేళ్ల వద్ద గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జ్, రంగారెడ్డి జిల్లా గారి న్యాయస్థానంలో
OS. నెం. 43/2021
లో
I.A. నెం. 129/2021
దిగువ తెలిపిన వారి మధ్య:
గొంద్ల యాదమ్మ ....వాది
మరియు
పసులాడి వెన్నయ్య మరియు మరొకరు .....ప్రతివాదులు
దిగువ తెలిపిన వారికి,
1. శ్రీ పసులాడి వెన్నయ్య తండ్రి స్వర్గీయ కిష్టయ్య, వయస్సు సుమారు 65 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: 1-22, ఎల్తైర్తి గ్రామం, శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా.
2. శ్రీమతి వెన్నమనేని సునీత భర్త దామోదర్ రావు, నివాసం: Q-No.242, B-1, B.D.L, భానూర్ గ్రామం, పటాన్‌చెరు మండలం, సంగారెడ్డి జిల్లా
పైన తెలిపిన వారి రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, ఎల్తైర్తి గ్రామం మరియు జీపీ వద్ద గల ఎస్.6-08 గుంటలు విస్తీర్ణం, సర్వే నెం.121 కలిగిన దావా షెడ్యూల్ భూమికి సంబంధించి సివిల్ జడ్జ్ వద్ద గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయస్థానం సమక్షంలో మీపై విభజన మరియు విడి స్వాధీనత కొరకు దావా దాఖలు చేశారు మరియు ఈ గౌరవనీయ న్యాయస్థానం మీకు నోటీస్ మరియు సమన్లు జారీ చేసినదని తెలియజేయడమైనది మరియు వాటిని మీ విరునామాలకు పంపబడినవి, కాని మీరు వాటిని స్వీకరించలేదు మరియు సదరు నోటీస్ మరియు సమన్లను తీసుకొనుటకు తిరస్కరించారు. పైన తెలిపిన సదరు దావా మీ కౌంటర్ మరియు ప్రాతపూర్వక స్టేట్‌మెంట్ లేదా ఇతరత్రా వాటితో సహా మీ హాజరు కొరకు 23.07.2025కు వాయిదా వేయబడినది.
అందువల్ల స్వయంగా లేదా మీ అడ్వకేట్ ద్వారా చేవేళ్ల వద్ద గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయస్థానం సమక్షంలో 23 జూలై 2025న ఉ.10.30 గం.కు హాజరు కావలెను, లేనిపో రికార్డులో లభించే మెటీరియల్ పేపర్స్/డాక్యుమెంట్స్ ప్రకారం ఈ గౌరవనీయ న్యాయస్థానం ద్వారా మీ పరోక్షంలో సదరు విషయం విచారించి నిర్ణయించబడుతుంది.
ఇందునిమిత్తమే ఈ ప్రకటన జారీచేయబడినది
(న్యాయస్థాన ఉత్తర్వు ద్వారా)
సం/- ఎన్.రఘునాథ్ రెడ్డి, అడ్వకేట్
సన్‌నిటీ, రంగారెడ్డి జిల్లా, మొబైల్: 9948344621

గంజాయి సాగుచేస్తే జైలుకే..

సిర్గాపూర్, జూన్ 24 : గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు,అమ్మితే, రవాణా చేసినా కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని సిర్గాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి మంగళవారం హెచ్చరించారు. అక్రమానికి పాల్పడితే మాత్రం ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు రైతు భరోసా, ఉచిత కరెంటు కనెక్షన్, పంటల బీమా తదితరవి నిలిచిపోతాయన్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా తరలింపు పట్ల ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సమాచారమందించిన పేర్లను మాత్రం గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ప్రజలు ఇలాంటి అక్రమాలకు పాల్పడొద్దని సూచించారు.

అన్నిగ్రామాలు మున్సిపాలిటీలే..

- 1959లో రాష్ట్రంలోనే తొలి పంచాయతీ సమితి పటాన్‌చెరు
- 2025లో మండలం నుంచి పంచాయతీలు గాయబ్
- మరో కొత్త మున్సిపాలిటీగా ఇంద్రేశం
- రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం
- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మిగులు గ్రామాల విలీనం
- కొందరి రాజకీయ ప్రయోజనాలకోసమే ఈ నిర్ణయం ■ ప్రజల్లో నిరసనలు

పటాన్‌చెరు రూరల్, జూన్ 24 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి బ్లాక్ సమితిగా పటాన్‌చెరును ఏర్పాటు చేశారు. 1959లో పటాన్‌చెరు ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి బ్లాక్ పంచాయతీ సమితిగా ఏర్పాటై పల్లెలకు సమగ్ర పరిపాలనను అందజేసింది. ఆ తర్వాత బ్లాక్ స్థాయిలో మండల పరిషత్ వ్యవస్థను ఏర్పాటైంది. 1986లో పటాన్‌చెరు మండల వ్యవస్థను ఏర్పాటు చేశారు. 1994లో పంచాయితీరాజ్ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించారు. 20,30 గ్రామాలతో మండల పరిషత్ వ్యవస్థ దాదాపు 39 ఏండ్లుగా దిగ్విజయంగా కొనసాగింది. 2025 వచ్చేసరికి పటాన్‌చెరు మండల పరిషత్, గ్రామ పంచాయతీల వ్యవస్థ పూర్తిగా కనుమరుగు కానున్నది. రాష్ట్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయం పటాన్‌చెరు మండలంలోంచి పంచాయితీలు, మున్సిపాలిటీలుగా మారుతున్నాయి. ఒకప్పుడు 29 పంచాయతీలతో అతిపెద్ద మండలంగా ఉన్న పటాన్‌చెరు మండలం మండలాల విభజనతో 2018లో అమీన్‌పూర్ మండలంగా మరో కొత్త మండలంగా ఆవిర్భవించింది. 19 గ్రామ పంచాయతీలతో ఉన్న పటాన్‌చెరు మండలంలోంచి ఐదు గ్రామ పంచాయతీలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో 2024లో విలీనం చేశారు. రింగురోడ్డు ఉన్న గ్రామాలను తెల్లాపూర్‌లో విలీనం చేయడంతో 14 గ్రామాలతో మండలం కొనసాగింది. 2024లోనే ఇస్నాపూర్ మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా చేశారు. దీంతో 11 గ్రామాలే పటాన్‌చెరు మండలంగా మిగిలాయి. 2025న ఆ 11 గ్రామాల్లోంచి 6 గ్రామాలను ఇంద్రేశం మున్సిపాలిటీగా, 5 గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో పటాన్‌చెరు మండలంలో ఒక్క గ్రామ పంచాయతీ కూడా లేకుండా పోయింది. ఇప్పుడు మండల పరిషత్ వ్యవస్థ పూర్తిగా కనుమరుగవబోతున్నది. సోమవారం రాత్రి మంత్రిమండలి ప్రకటన చేయడంతో మండల పరిషత్, పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా మాయం అవుతున్నది.

ఇంద్రేశం కొత్త మున్సిపాలిటీ

పటాన్‌చెరు మండలంలో ఇంద్రేశం గ్రామం గత పదేండ్లలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం, ఐనోల్, పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, రామేశ్వరంబండ, బచ్చుగూడెం గ్రామాలతో ఇంద్రేశం మున్సిపాలిటీని ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి భానూర్, నందిగామ, క్యాసారం, లక్డారం, రుద్రారం గ్రామాలను తీసుకొని వస్తున్నారు. ఐదు గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయబోతున్నారు. ఇప్పుడు 11 గ్రామాలు పటాన్‌చెరు మండలం నుంచి కనుమరుగు అవుతున్నాయి. 29 గ్రామ పంచాయతీలతో కళకళలాడిన పటాన్‌చెరు మండలం దశాబ్దకాలంలోనే కనుమరుగైంది. ఇప్పుడు అన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయి. ప్రజలకు పంచాయతీ సేవల స్థానంలోనే మున్సిపల్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయం

ప్రజల్లో ఆందోళన

ఇంద్రేశం గ్రామం ఒక్కటే మేజర్ పంచాయతీగా అభివృద్ధి చెందింది. దాని తర్వాత రామేశ్వరంబండ గ్రామం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. మిగిలిన చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, ఐనోల్, బచ్చుగూడెం గ్రామాలు వ్యవసాయాధారిత గ్రామాలు. వీటిని కూడా మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పేదరికం, రైతులు అధికంగా ఉన్న ఈ గ్రామాలు మున్సిపాలిటీల్లో చేరడంతో పన్నులు అధికంగా ఉంటాయని భయపడుతున్నారు. పైగా మున్సిపాలిటీ సేవలు అంతంతగానే ఉంటాయని భావిస్తున్నారు. తమ గోడు ఎవరూ పట్టించుకోరనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొందరి రాజకీయ ప్రయోజనాల కోసం తమను మున్సిపాలిటీల్లోకి చేర్చారని ప్రజలు వాపోతున్నారు. ఇటు క్యాసారం, లక్డారం గ్రామాలు సైతం గ్రామీణ నేపథ్యంలోనే ఉన్నాయి. మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారనగానే వారు జీర్ణించుకోలేక పోతున్నారు.

140వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

గుమ్మడిదల,జూన్ 24 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రైతులు, గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 140వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామశివారులో జీహెచ్ఎంసీ పరిధిలోని చెత్తను డంపింగ్ చేయడానికి రాంకీ సంస్థకు అప్పచెప్పడంతో ఇక్కడి వాతావరణం, భూగర్భజలాలు కలుషితమై వ్యవసాయభూములు వ్యవసాయానికి యోగ్యం కాకుండా పోతాయని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని రైతు జేఏసీ నాయకులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డంపింగ్

రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ సభ్యులు

యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి ఇక్కడి గ్రామాలు, ప్రజలను రక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, మహిళ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లవల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించరా..?

గ్రామరైతుల ఆవేదన

గుమ్మడిదల, జూన్ 24: రాష్ట్రంలో పరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించడానికి చేపట్టిన రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామాల్లో నిర్వహించి మాగ్రామంలో ఎందుకు నిర్వహించరని నల్లవల్లి గ్రామరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని నల్లవల్లి గ్రామంలో రైతులు మాట్లాడారు. డంపింగ్‌యార్డు ఏర్పాటును అడ్డుకుంటున్నారన్న అక్కసుతోనే మాగ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లవల్లిలో నిర్వహించవలసిన రెవెన్యూ సదస్సును గుమ్మడిదల రైతువేదికలో నిర్వహించడం పట్ల తీవ్రంగా ఖండించారు. వెంటనే అధికారులు స్పందించిన నల్లవల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించాలని వేడుకుంటున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జహీరాబాద్, జూన్ 24 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని న్యాల్‌కల్ మండల విద్యాధికారి మారుతీరాథోడ్ అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని మల్లి ప్రాథమికోన్నత తెలుగు, ఉర్దు మీడియం పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులు, వంటశాల, పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్య బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. బడీడు పిల్లలను

మల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాధికారి మారుతీ రాథోడ్

పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

కోహీర్, జూన్ 24 : ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు పెద్దతోట రాచన్న కోరారు. మంగళవారం మండలంలోని కవేలి మహాలింగ సంగమేశ్వరాలయ ఆవరణలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై చర్చించారు. ప్రోగ్రామ్‌ల కోసం రాకపోకలు నిర్వహించే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ఫొటో, వీడియో గ్రాఫర్లు మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అందరికీ బీమాను కల్పించాలని సూచించారు.

రాయికోడ్‌లో ఎంఈవో పర్యటన

రాయికోడ్,జూన్ 24 : రాయికోడ్ ప్రాథమిక పాఠశాల, ఆదర్శ పాఠశాల హాస్టల్ భవనం, మండలంలోని చిమ్మాపూర్‌లో మంగళవారం ఎంఈవో మాణెయ్య పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని చిమ్మాపూర్, మొర్టాగా గ్రామాల్లో కొత్తగా పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాయికోడ్ ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో బాలికలను చేర్పించుకునేలా వసతులు సమకుర్చుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి దీపికకు ఆదేశాలు జారీచేశారు. ఆయన వెంట హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రైతుభరోసా

మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, జూన్ 24: అర్హులైన రైతులందరికీ రైతుభరోసా పథకం వర్తింపజేస్తామని మంత్రి దామోదరరాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగుపేట రైతువేదికలో నిర్వహించిన రైతుపండుగ సంబురాల్లో మంత్రి పాల్గొన్నారు. జిల్లాలో 3,75, 932 మంది రైతుల ఖాతాల్లో రూ. 425. 17 కోట్ల డబ్బులు జమచేసినట్లు వివరించారు. మంత్రి పర్యటన అనంతరం తిరుగుప్రయాణంలో సంగుపేట మహిళావ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ ప్రావీణ్య తనిఖీచేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, స్టేట్ మార్కుఫెడ్‌డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగుపేట రైతువేదికలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

సీఎస్ రామ కృష్ణారావు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24: ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వన మహోత్సవంలో శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీలో అర్హులైన 500 మంది

జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని వివరించారు. ముఖ్యంగా జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును పెంచేందుకు దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రోశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24 : యువత చెడు అలవాట్లకు బానిస కాకుడదని, దేశాన్ని నశా ముక్త భారత్‌గా నిర్మించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మిషన్ పరివర్తన నశా ముక్త్ భారత్, జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వెలుగు కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మొక్క నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థులతో నశ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ

మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

చేయించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ అధికారి లలితా కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి బ్లూ జట్టు ఘన విజయం

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24 : హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సంగారెడ్డి బ్లూ జట్టు 87 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కొండాపూర్ మండలం సీ కోనాపూర్‌లోని ఎంఏ క్రికెట్ మైదానంలో సంగారెడ్డి జిల్లా బ్లూ జట్టు, సిద్దిపేట జిల్లా పింక్ జట్టు మధ్య పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి బ్లూ జట్టు నిర్ధారిత 45 ఓవర్లలో 321 పరుగులు చేసింది. ఈ జట్టులో చరణ్ రాథోడ్ 147 పరుగులు, సిద్దార్థరెడ్డి 54, శ్రీవర్షిత్ 49 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు కేవలం 45 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. దీంతో 87 పరుగుల తేడాతో సంగారెడ్డి బ్లూ జట్టు ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా చరణ్ రాథోడ్ నిలిచాడు. ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

దొంగల ముఠా అరెస్టు

కిలో వెండి, 15 బైక్‌లు స్వాధీనం

పటాన్‌చెరు, జూన్ 24 : పాత నేరాస్తులు జైల్లో పరిచయంతో దొంగల ముఠాగా ఏర్పడి పలు ప్రాంతంలో దొంగతనాలు చేశారని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో నవాపాన్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైక్ పై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వచ్చారని వారిని అదుపులోని తీసుకొని విచారించామన్నారు. పటాన్‌చెరు, సీసీఎస్ పోలీసులు దొంగలను విచారణ చేయగా, పలు విషయలు వెలుగులోకి వచ్చాయి. వడ్డే శివకుమార్(28), కందాడ మహేందర్‌రెడ్డి (42), జోగోల్ల గణేశ్(19), అనిల్‌సింగ్ (19), అలకుంట నరేశ్ (28), వడ్ల బ్రహ్మం, గోపన్‌పల్లి నర్సిములు, మహిపాల్‌రెడ్డి పలు దొంగతనలు చేశారన్నారు. మహిపాల్ రెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగల నుంచి ఒక సామ్ సంగ్ టీవీ, 15 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఒక కిలో వెండి, రూ.20 లక్షలు సొత్తు స్వాధీనం చేశామన్నారు. కంది జైల్లో వడ్డే శివ కుమార్, జోగోల్ల గణేశ్ పరిచయం ఏర్పచుకొని విడుదలైన తర్వాత ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయడం ప్రారంభించారని తెలిపారు. వీరు ఇద్దరు పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న చిట్కుల్, ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నారని, రాత్రి సమయంలో తాళం వేసిన ఇండ్లలో దొంగతనం చేసే వారన్నారు. ఈ సమావేశంలో పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్లు వినాయకరెడ్డి, బి.రాజు, సీసీఎస్ సీఐలు శివ కుమార్, రామానాయుడు, సీసీఎస్ ఎస్ శ్రీకాంత్, ఎండీ, అసీఫ్ అలీ, ఎఎస్సై రాజు, హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజు, కానిస్టేబుట్ సుకేష్ రెడ్డి, అంజయ్య, మోహన్, ప్రశాంత్, సంతోశ్ ఉన్నారు.

పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో దొంగల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ ప్రభాకర్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కంది, జూన్ 24 : ప్రజలకు మెరుగైన సేవలందించాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కంది మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. వ్యవసాయ భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సూచించారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ రావు

జహీరాబాద్, జూన్ 24 : జహీరాబాద్ పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ రావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఉమా మహేశ్వర్‌రావును బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డీ. సుభాష్ రావును జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

తెల్లాపూర్ కమిషనర్‌గా అజయ్ కుమార్ రెడ్డి

రామచంద్రాపురం,జూన్ 24 : తెల్లాపూర్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా అజయ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.